నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఆర్కేపురం, జనవరి 2 : శివం హిల్స్, వీరభద్రనగర్, సీతారామపురం, గణేశ్‌నగర్(కుంట్లూరు), విజయనగర్, స్వాతిరెసిడెన్సీ, శివపార్వతి, శ్రీనివాస కాలనీ, కమలానగర్, నేతాజీనగర్, హుడా కాంప్లెక్స్, ఆంధ్రకేసరినగర్, సౌత్‌ఎండ్‌పార్కు, ఎల్బీనగర్, ఆటోనగర్ ఇండస్ట్రీయల్, ఆల్‌ఇండియా రేడియో, సిరీస్, మన్సూరాబాద్, హైకోర్టు కాలనీ, హుడా సాయినగర్, ఇంద్రనగర్, డీర్‌పార్కు 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు సరూర్‌నగర్ విద్యుత్‌శాఖ డీఈ కె.కె.రామకృష్ణ తెలిపారు.

చంపాపేట: చంపాపేట విద్యుత్ సౌద పరిధిలోని అన్ని ఫీడర్లకు సంబంధించి విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి, మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చంపాపేట 11కేవీ అంజిరెడ్డి కాలనీ, పద్మానగర్ కాలనీ, కర్మన్‌ఘాట్, సాయిరాంనగర్ కాలనీ, సుల్తాన్‌వాల్వా, రీల్‌బేకర్, చంపాపేట, ఆర్‌టీసీ కాలనీ, సింగరేణికాలనీ, భానునగర్, గ్రీన్‌పార్క్ కాలనీ, పవన్‌పురి కాలనీ, ఉదయ్‌నగర్, మైత్రీపురం, చంపాపేట ఓల్డ్ విలేజీ, బృందావన్ కాలనీ, వైశాలినగర్ కాలనీ, నాగార్జున నగర్, పటేల్‌నగర్, శిఖరాఎన్‌క్లేవ్, 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు తెలిపారు.

సైదాబాద్: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్-8 డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆనంద్ నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు డాన్ స్కూల్, బీబీ క్యాన్సర్ హాస్పిటల్, రాజ్ దర్బార్, జియాఖా హోటల్, ఇబ్రహీం ఫంక్షన్ హాల్, మౌలాలీ కా మాస్క్, బూరా మియ్యా గిర్నీతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జానారెడ్డికి డాక్టరేట్

ఆర్కేపురం, జనవరి 2 : గణిత శాస్త్రంలో నాన్-న్యూటోనియన్ ఫ్లూయిడ్ ఫ్లో ప్రాబ్లమ్స్ ఓవర్ ఏ స్ట్రేచింగ్ షీట్ ఇన్ ప్రెజెన్స్ ఆఫ్ మాగ్నటిక్ ఫీల్డ్ అను అంశంలో చేసిన పరిశోధనకు గాను కొత్తపేటకు చెందిన సంకిరెడ్డి జానారెడ్డికి తళిమనాడులోని అన్నా మలై యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా ను ప్రదానం చేసింది. అన్నామలై యూనివర్సిటీ గణిత శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ వలసమీ, వర్ధమాన ఇంజినీరింగ్ కళాశాల గణిత శాస్త్ర ఆచార్యుడు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో చేసిన పరిశోధనలను గుర్తించి అన్నామలై యూనివర్సిటీ జానారెడ్డికి ఈ డాక్టరేట్‌ను చేసింది. సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చిన జానారెడ్డి డాక్టరేట్ పట్టా పొందడంపై కుటుంబ సభ్యులు స్నేహితులు, సహ అధ్యాపకులు అభి నందనలు తెలిపారు. జానారెడ్డి ప్రస్తుతం హైదరాబాద్‌లోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహి స్తున్నాడు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాజీ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి

కందుకూరు, జనవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సూచించారు. నూతన సంవత్సరంలో బీఆర్ఎస్ పార్టీకి అంతా మంచి జరుగుతుందని ఆకాంక్షించారు. గురువారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, మాజీ యువజన నాయకులు పొలెమోని అశోక్ ముదిరాజ్, మండల మహిళా అధ్యక్షురాలు తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, మాజీ సర్పంచ్ జంగయ్య, పరంజ్యోతి, నవీన్, బర్కం వెంకటేశ్ తదితరులు ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పాటు కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానం చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ జెండాను రెపరెపలాడించాలని కోరారు. పార్టీని బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు గోవర్ధన్, పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం

ఆర్కేపురం, జనవరి 23 : ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్ నిరుపేద కుటుంబానికి చెందిన చందన అనే యువ క్రికెట్ క్రీడాకారిణి అండర్ 23 ఎంపికైంది. చందనకు సామాజిక సేవా వేత్త చిలుక ఉపేందర్‌రెడ్డి ఆధునిక క్రికెట్ కిట్టు కొనుగోలు కోసం రూ.25వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభ, నైపుణ్యాలు ఉండేవారికి పేదరికం అడ్డు కాకూడదనే ఉద్దేశంతోనే పేద విద్యార్థులకు, క్రీడాకారులకు చేయూతను అందించడానికి ఎల్లవేళలా ముందుంటానని తెలిపారు. క్రికెట్‌లో చందన సత్తా చాటి దేశానికి, రాష్ట్రానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి లింగస్వామిగౌడ్, జగిని రమేశ్‌గుప్తా, శ్యామ్, విప్లవ్, శ్రీకాంత్, కిషన్, సంతోష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తా

విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

సైదాబాద్, జనవరి 2 : చంచల్‌గూడ జూనియర్, డిగ్రీ కళాశాలలను గురువారం మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల సందర్శించారు. ఈ సందర్భంగా డిగ్రీ కాలేజ్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను, తరగతి గదులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. కళాశాలల్లో నెలకొన్న సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి నూతన సంవత్సరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చావునీ డివిజన్ కార్పొరేటర్ సలాం షాహిదీ, జూనియర్, డిగ్రీ కాలేజీల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది, మజ్లిస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు బాలామృతం పంపిణీ

సైదాబాద్, జనవరి 2 : సైదాబాద్ డివిజన్ పరిధిలోని పూసలబస్తీలోని పూసల కుల సంఘం కార్యాలయం సమీపంలోని మినీ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి గర్భిణులకు, చిన్నారులకు బాలామృతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణులు, చిన్నారుల కోసం సరఫరా చేస్తున్న పౌష్టికాహారం ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, బస్తీ నాయకులు జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

బాలామృతం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణారవీందర్ రెడ్డి

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు

ఆర్కేపురం, జనవరి 2 : పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ దేప సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీ, జింకలబావి కాలనీ, వికాస్‌నగర్, క్రాంతినగర్, సాయికృష్ణనగర్, నరసింహపురి కాలనీల్లో పారిశుధ్య మహిళా కార్మికులకు నూతన సంవత్సరం సందర్భంగా రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు, యువజన నాయకుడు స్వరూప్ రాజ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు లక్ష్మారెడ్డికి కాలనీలోని సమస్యలను వివరించారు. గతంలో మహిళా మండలి భవనం మంజూరైందని, ఎన్నికల కోడ్ వల్ల టెండర్లకు ఎవరు రాలేదని మళ్లీ టెండర్ పిలిపించాలన్నారు. రోడ్డు నెం.4, 5లో డ్రైనేజీ వర్క్ పూర్తయిన తరువాత రోడ్డు వేయలేదన్నారు. పాత బడిపోయిన డ్రైనేజీ పైప్‌లైన్ మార్చి నూతన పైప్‌లైన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. రోడ్డు నెం.6 నుంచి వికాస్‌నగర్, క్రాంతినగర్ మున్సిపల్ కార్యాలయం అప్రూచ్ రోడ్‌ని ఫెన్సింగ్ వేశారని, అది వెంటనే తీయించాలని లక్ష్మారెడ్డిని కోరారు. కాలనీ అధ్యక్షుడు లింగారెడ్డి, జగిని రాంమూర్తి, శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, పారుపల్లి దయాకర్‌రెడ్డి, బేర బాలకిషన్, ధన్‌రాజ్ గౌడ్,మహేందర్‌యాదవ్, శంకర్‌యాదవ్, సురోత్తం, శివ ప్రసాద్, గుల్షాన్ ఉన్నారు.

మిధాని అదనపు ఎండీగా గౌరీ శంకర్‌రావు

గౌరీ శంకర్‌రావు (ఫైల్)

సైదాబాద్, జనవరి 2 : కంచన్‌బాగ్‌లోని మామాకేంద్ర ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ మిశ్రా ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) అదనపు మేనేజింగ్ డైరెక్టర్‌గా గౌరీ శంకర్‌రావు బాధ్యతలు స్వీకరించారని మిధాని సంస్థ తెలిపింది. డిపార్టుమెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రొడక్షన్ (ఫైనాన్స్) డైరెక్టర్‌గా కొనసాగుతున్న ఆయనకు అదనపు బాధ్యతలను కేటాయిస్తూ రక్షణ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలలపాటు బాధ్యతలను నిర్వహిస్తారని, తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు అదనపు బాధ్యతల్లో కొనసాగిస్తారని తెలిపారు. గౌరీ శంకర్‌రావు నరంశెట్టి వృత్తిరీత్యా చార్టర్డ్ అకౌంటెంట్‌గా 35 ఏండ్ల అనుభవంతో 2020 సంవత్సరంలో మిధానిలో ఫైనాన్స్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారని పేర్కొన్నారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

రవీంద్రభారతి, జనవరి 2 : సంచార జీవులైన వడ్డెరులను దేశంలోని కొన్ని రాష్ట్రాలలో ఎస్సీ, ఎస్టీలుగా పరిగణిస్తున్నట్లుగానే తెలంగాణలోనూ ఎస్టీ జాబితాలో చేర్చాలని, వడ్డెరులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని అఖిల భారత వడ్డెర, వోడ్, బోవీ, బేల్దార్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన వడ్డెరల రాష్ట్ర సదస్సులో తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జెరిపాటి జైపాల్ అఖిల భారత వడ్డెర, వోడ్, బోవీ, బేల్దార్ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఐఎన్‌టీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు వేముల తిరుమలదేవి, ప్రధాన కార్యదర్శి గుంజ రేణుక తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి శుభాకాంక్షలు

మలక్‌పేట, జనవరి 2: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చెకోలేకార్ లక్ష్మి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్లతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

రవీంద్రభారతి, జనవరి 2 : సంక్రాంతి సంబురాల్లో భాగంగా భద్రాద్రి సాంస్కృతిక వారధి ఆధ్వర్యంలో కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు గురువారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. సుమారు వంద మంది విద్యార్థినులు ఈ ప్రదర్శనలు నిర్వహించి వీక్షకులను అలరింపజేశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దైవజ్ఞశర్మ విచ్చేసి కూచిపూడి, భరతనాట్యప్రదర్శనలను ప్రారంభించి, అనంతరం విద్యార్థినులకు అవార్డులు, జ్ఞాపికలు అందజేశారు. భద్రాద్రి సాంస్కృతిక శాఖ వ్యవస్థాపకులు కొండల్‌రావు, ప్రతినిధులు, విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాలు

రవీంద్రభారతి, జనవరి 2 : మహావీర్ ఇంటర్నేషనల్ స్వర్ణోత్సవాలు స్వర్ణోదయ పేరుతో ఈ నెల 4,5 తేదీల్లో హైదరాబాద్, శంషాబాద్ సిటాడెల్ కన్వెన్షన్‌హాల్‌లో జరుగనున్నాయి. ఈ స్వర్ణోత్సవాలను డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ప్రారంభిస్తారని అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో మహావీర్ ఇంటర్నేషనల్ అపెక్స్ స్వర్ణోత్సవాల నిర్వహణ కమిటీ చీఫ్ కన్వీనర్లు శీల్‌జైన్, అజయ్ నహత, చైర్మన్ వినోద్ సంచేటి, వైస్ చైర్‌పర్సన్ అర్చన సహత, కన్వీనర్ సీమషీల్ కుమార్‌జైన్ వివరాలను వెల్లడించారు. స్వర్ణోత్సవాలతో పాటు మహావీర్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ చాప్టర్ రజతోత్సవాలను కూడా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 800 మంది ప్రతినిధులు పాల్గొననున్నట్లు తెలిపారు.

వనస్థలిపురం, జనవరి 2 : నూతన సంవత్సరం సందర్భంగా బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌ను గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతోపాటు హస్తినాపురం బీజేపీ అధ్యక్షుడు నరేశ్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్‌పై అధికారులు దృష్టి సారించాలి

హయత్‌నగర్‌లో జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యను పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, జనవరి 2 : హయత్‌నగర్‌లో విజయవాడ జాతీయ రహదారిపై యూటర్న్ ట్రాఫిక్ సమస్యపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి కోరారు. గురువారం హయత్‌నగర్‌లో జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యపై వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి, స్థానికులు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హయత్‌నగర్‌లోని రాఘవేంద్ర హోటల్ సమీపంలో, వర్డ్ అండ్ డీడ్ స్కూల్ వద్ద ట్రాఫిక్ సమస్యను పరిశీలించారు. జాతీయ రహదారిపై పలుచోట్ల యూటర్న్‌లు మూసివేయడం వల్ల నిలకడగా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనుల వల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా జాతీయ రోడ్డు విస్తరణపై ట్రాఫిక్ సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరారు. వారి వెంటా స్థానికులు బండారి భాస్కర్, ఎర్ర శ్రీకాంత్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

అంబర్‌పేట, జనవరి 2 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధి మల్లన్నగుడిలో జరగబోయే ఉత్సవాల విషయమై డివిజన్ కార్పొరేటర్ బీ. పద్మావెంకటరెడ్డి గురువారం ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు అక్కడకు వెళ్లి ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.

బీసీ యువత కోసం ప్రత్యేక అకాడమీలను ఏర్పాటు చేయండి..

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంజన, శ్రీనివాస్‌రావు

కాచిగూడ, జనవరి 2: తెలంగాణ ప్రభుత్వం బీసీ యువతీయువకుల కోసం ప్రత్యేక ఐఏఎస్, ఐపీఎస్ అకాడమీలను ఏర్పాటు చేయాలని తెలంగాణ బీసీ యువ చైతన్య పోరాట సమితి విజ్ఞప్తి చేసింది. అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లతో కూడిన ప్రత్యేక అకాడమీలను ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం బీసీ యువ చైతన్య పోరాట సమితి అధ్యక్షురాలు కె. సంజన, హ్యూమానిటీ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ కొండ శ్రీనివాస్‌రావు ఎమ్మెల్సీ కోదండరామ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో పాల్గొన్న డిపో-1 మేనేజర్ విజయ్

హయత్‌నగర్, జనవరి 2: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రోడ్డు ప్రమాద నివారణ చర్యలను ప్రతి ఒక్కరూ తప్పకుండా అవలంభించాలని ఆర్టీసీ హయత్‌నగర్ డిపో-1 మేనేజర్ జలగం విజయ్ సూచించారు. గురువారం హయత్‌నగర్ డిపో-1లో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డిపో మేనేజర్ విజయ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి మాసంలో జరిగే రోడ్డు భద్రతా ఉత్సవాలు ఈ ఏడాది జనవరి 1 నుంచి చివరి వరకు కొనసాగుతాయని తెలిపారు. ఏదైనా ప్రమాదం జరిగినట్లయితే కుటుంబం మొత్తం ఆర్థికంగా, మానసికంగా ఎంతో నష్టపోతుందని, ఒక్కోసారి మన జాగ్రత్తలో ఉన్న కూడా అనుకోకుండా ప్రమాదాలు జరుగుతుంటాయని తెలిపారు. రోడ్లపై ప్రయాణాలు చేసేటప్పుడు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, పెద్ద వాహనాలు నడిపే వాహనదారులు సీట్ బెల్టు ధరించి ట్రాఫిక్ నియమాలు పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలను నడపకూడదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదని వివరించారు. ప్రతిరోజు డ్యూటీకి వెళ్లే ముందు సిబ్బందితో భద్రతా సూక్తి ప్రతిజ్ఞ చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీజీ సెట్ సర్టిఫికెట్ల జారీ ప్రారంభం

అభ్యర్థులకు సెట్ సర్టిఫికెట్లను అందజేస్తున్న అధికారులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: తెలంగాణ స్టేట్-స్టేట్‌లెవెల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీజీ సెట్) సర్టిఫికెట్ల జారీని అధికారులు గురువారం ప్రారంభించారు. గతేడాది మేలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం సెప్టెంబర్ 10 నుంచి మూడు రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలను నిర్వహించారు. ఫలితాలను నవంబర్ 16న విడుదల చేశారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తైన అనంతరం సర్టిఫికెట్ల జారీని మొదలుపెట్టారు. ఓయూ పరిపాలనా భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, సెట్ మెంబర్ సెక్రెటరీ, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డి, ఓఎస్డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్ చేతుల మీదుగా సర్టిఫికెట్లను జారీ చేశారు. అర్హత సాధించిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను సెట్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఒరిజినల్ అక్‌నాలెడ్జ్‌మెంట్ స్లిప్‌తో వచ్చి తీసుకోవచ్చన్నారు.

శుభాకాంక్షలు

వనస్థలిపురం, జనవరి 2 : రెడ్డి సంక్షేమ సంఘం గ్రేటర్ అధ్యక్షుడు సంరెడ్డి భుజంగరెడ్డి గురువారం మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని మర్యా దపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

కానిస్టేబుల్ కిరణ్‌కు నివాళులు

సైదాబాద్, జనవరి 2 : కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడ్డ ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ జాటావత్ కిరణ్ పార్థివదేహానికి హైదరాబాద్ పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు నివాళులర్పించారు. గురువారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని ఆస్మాన్‌ఘడ్ లంబాడిబస్తీలోని ఆయన నివాసానికి వచ్చి కిరణ్ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ అంత్యక్రియల నిమిత్తం నగర కమిషనర్ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ. 30 వేలు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్ పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ నుంచి రూ. 50 వేలు హైదరాబాద్ పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నల్ల శంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కంప శ్రీశైలం అందజేశారు. కిరణ్ కుటుంబానికి తాము అండగా ఉంటామని వారు పేర్కొన్నారు.

బీఈ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ) కోర్సుల మూడో సెమిస్టర్ మెయిన్ పరీక్ష ఫీజును ఈనెల 6వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఎఫ్ఏ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఎఫ్ఏ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎఫ్ఏ ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్స్, పెయింటింగ్ కోర్సుల మూడు, ఐదు, ఏడు, తొమ్మిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 7వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బీఈ కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 2: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) కోర్సుల సెమిస్టర్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.